## క్లుప్తంగా

### ప్రజా సంక్షేమానికి కృషి

అలంపూర్: ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 61 మంది లబ్ధిదారులకు రూ.14,81,500 విలువ గల చెక్కులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి, కరుణసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకలకు చెందిన హనుమంతుగౌడ్ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

* ఎర్రవల్లి మండల పరిధిలోని వల్లూరులో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కిశోర్ మాతృమూర్తి మరియమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే అబ్రహం, జిల్లా నాయకులు బాసు హనుమంతునాయుడు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు



ధరూరు: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. శనివారం సాయంత్రం జూరాల ప్రాజెక్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రెండు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### కిరాణం దుకాణంలో చోరీ

అయిజ:మండలంలోని వెంకటాపురం గ్రామంలో మూసి ఉన్న కిరాణం డబ్బాలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. తాళం పగులగొట్టి రూ.15 వేల విలువగల నిత్యావసర సరుకులు అపహరించినట్లు షాపు యజమాని చరణ్ పేర్కొన్నారు.

### వర్షాలకు కూలిన మట్టిమిద్దె



గద్వాల: ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పట్టణంలో మట్టి మిద్దె కూలిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని 11వ వార్డు వేదనగర్‌లో వెంకటరాజు అనే వ్యక్తి నివాసముంటున్న మట్టి మిద్దె పైకప్పులు కూలింది. ప్రభుత్వం తరపున ఆదుకోవాలంటూ బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరాలో భాగంగా చేపట్టిన మరమ్మతులో భాగంగా ఆదివారం అయిజ, గట్టు, వడ్డేపల్లి, రాజోళి మండలాల్లోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నటు ఏడీఈ నీలి గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ, గట్టు మండలాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, వడ్డేపల్లి, రాజోళి మండలాల పరిధిలో రెండు గంటల పాటు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

### కానాయపల్లిలో బిందె సేవ



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా సుఖ సంతోషాలతో ఉండాలంటూ గ్రామస్తులు బిందె సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కృష్ణానది నీరును కళశాలలో నింపుకొని ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశ్వరమ్మ, భీమన్ననాయుడు, కొత్త కిషోర్, శివనారాయణ, లక్ష్మీనారాయణ, గోకరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో కృష్ణాష్టమి వేడుకల్లో యాదవులు



ఇటిక్యాలలో ప్రత్యేక వేషధారణలో చిన్నారులు

# భజరే నంద నందన

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఓంకారం జెండాను ఆవిష్కరించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలో అందంగా అలంకరించారు.

* మానవపాడు మండలంలోని చెన్నిపాడు గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఓంకారం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రాజశేఖర్‌శర్మ, మురళీకృష్ణ, గోవర్ధన్, కుర్మన్న, వెంకటేష్, లక్ష్మీనారాయణ, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

* ఉండవెల్లి మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధకవర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించిన ఊరేగించారు. తక్కశీలలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

* వడ్డేపల్లి గట్టుపై వెలసిన వసంత మాధవస్వామి, తనగల గట్టుపై వెలసిన తిమ్మప్పస్వామి, జూలెకల్ ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో వెలసిన కృష్ణుడి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

* కేటీదొడ్డి మండలంలోని గ్రామాల్లో జన్మాష్టమి వేడుకల సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఆలయ ఆవరణలో ఉట్టి కొట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

* అయిజ మండలంలోని ఉప్పలలో కృష్ణ, రేణుకా మాత ఆలయంలో వేదపండితులు వేడుకలను వేద మంత్రాలు పటిస్తూ, శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదే విధంగా బింగుదొడ్డి గ్రామంలో కృష్ణ దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

* ధరూరు మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి పాల్గొన్నారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భీంరెడ్డి, పుల్లారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సత్యన్న, రామన్న, సత్యారెడ్డి, సరాయి వెంకటేశ్వర రెడ్డి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

* ఇటిక్యాల మండలం పరిధిలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుడ్డారెడ్డిపల్లి, పెద్దదిన్నే గ్రామాల్లో ప్రజలు పాడి పంటలు, సుఖసంతోషాలతో ఉండాలని వేడుకలు చేశారు. చిన్నారులు వేషధారణలు ఆకట్టుకున్నాయి.



బొంకూరులో కృష్ణుడి వేషంలో చిన్నారి



చెన్నిపాడు శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారి



పూజలందుకుంటున్న గట్టు తిమ్మప్పస్వామి



బూరెడ్డిపల్లిలో జెండా ఆవిష్కరణలో బండ్ల జ్యోతి



చెన్నిపాడులో ఓంకారం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఉప్పలలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



తక్కశీలలో కృష్ణాష్టమి వేడుకలో భక్తులు



గద్వాలలో గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణల్లో చిన్నారులు

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

అలంపూర్: మిషన్ భగీరథ నీటి సమస్యను పరిష్కరించాలని జూలకల్ గ్రామస్తులు కోరారు. కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే విజయుడును వడ్డేపల్లి మండలం జూలకల్ గ్రామస్తులు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి మిషన్ భగీరథ నీళ్ల జిల్లా కేంద్రంలోని రేవులపల్లి నుంచి రావాల్సి ఉన్నట్లు తెలిపారు. గ్రామానికి చేరుకోవడానికి కనీసం 10 గ్రామాల నీళ్ల ట్యాంకులు నిండాల్సి ఉంటుంది. గ్రామం చివరగా ఉండటంతో నీళ్ల ట్యాంకుల ఒక్కసారి మాత్రమే వస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో నీటి సమస్య తలెత్తుతున్నట్లు పేర్కొన్నారు. జూలకల్ స్టేజీ నుంచి గ్రామంలోకి కి.మీ దూరం ఉంటుందని తెలిపారు. అక్కడి నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్ వేస్తే నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే సానుకులంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

## బీసీ రిజర్వేషన్ల కోసం చట్టం తేవాలి

గట్టు: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టి చట్టాన్ని తీసుకు రావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీవీ నర్సింహ, సభ్యురాలు నర్మద డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం గట్టు బస్టాండ్ ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం శాసన సభ తీర్మాణం చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రానికి పంపినట్లు తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అమలు చేయకుండా వాటికి మతం రంగు పులుముతున్నట్లు ఆరోపించారు. రిజర్వేషన్లు ఇచ్చేది మతం ప్రాతిపదికన కాదని, వెనుకబడిన వర్గాలకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సమాన అవకాశాలు కల్పించేందుకు అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుటిల ప్రయత్నాలను ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమలలో గోవిందు, స్వామి, నర్సింహులు, కార్మికులు భీముడు, జగన్, ఈరన్న, చంద్రు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



గట్టులో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

రాజోళి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై కేంద్ర ప్రభుత్వం తీర్మానం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్‌పై బీజేపి వైఖరిని నిరసిస్తూ శనివారం మండల కేంద్రం రాజోళిలో నిరసన తెలిపారు. దేశ వ్యాప్తంగా బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ వినిపిస్తుంటే కేంద్ర ప్రభుత్వం దాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బీజేపి పాలిత రాష్ట్రాల్లో రిజర్వేషన్‌ను కేటాయిస్తూ ప్రభుత్వాలు తీర్మానం చేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, తిక్కన్న, కేవీపీఎస్ నాయకులు రాజు, మహేష్, అశోక్, లక్ష్మన్న తదిదరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం

మల్దకల్: వరుసగా సెలవులు ఉన్న నేపథ్యంలో ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. అర్చకులు మధుసూదనాచారి, రవిచారి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అదే విధంగా పాల్వాయి అడవి ఆంజనేయ స్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, అమరవాయి వీరభద్రస్వామి ఆలయాల్లో కృష్ణాష్టమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మల్దకల్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కర్ణాటక బళ్లారికి చెందిన దాతలు శంకర్‌రెడ్డి, రాజశేఖర్, తిరుమల్ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, వాల్మీకి పూజారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

## రైతు మహాసభలను విజయవంతం చేయాలి

ఆత్మకూర్: అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర మహాసభలు మహబూబ్‌నగర్‌లో ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న, జిల్లా కార్యదర్శి వెంకటయ్య తెలిపారు. శనివారం పట్టణంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభలకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు కుర్మన్న, వెంకటన్న, మల్లేశ్, సల్వారెడ్డి, లింగన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## షీటీం ఆధ్వర్యంలో అవగాహన

ఎర్రవల్లి: మండల కేంద్రంలో షీటీం ఎస్ఐ తేజశ్విని బ్రిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ పొందుతున్న మహిళలకు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజశ్విని మాట్లాడుతూ.. షీటీం ద్వారా మహిళలకు భద్రతను కల్పించడంతో పాటు వారికి వచ్చే వేధిపులను నివారించి సురక్షిత వాతావరణం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈవ్ టీజింగ్, స్టాకింగ్, సైబర్ క్రైం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. వేధింపులకు గురైన వారు వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా షీటీంకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అదే విధంగా ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది శేషన్న, రాఘవేంద్ర, దివ్యవాణి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తేజశ్విని

## రోడ్లపై గుంతలు పూడ్చండి సారూ..!

మానవపాడు: రోడ్డుపై ఏర్పడిన మోకాలి లోతు గుంతలతో అవస్థలు పడుతున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు. గుంతలతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోకులపాడు నుంచి చంద్రశేఖర్‌నగర్‌కు వెళ్లే రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా మారినట్లు పేర్కొంటున్నారు. రాత్రుళ్లు ప్రమాదాలు జరగుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.



గుంతలమయంగా గోకులపాడు-చంద్రశేఖర్‌నగర్ రోడ్డు

## మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పాన్‌గల్: మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, కళావతమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలను ప్రేరేపిస్తుందన్నారు. రైతులకు గిట్టుబాట ధర కోసం, కార్మికులు కనీస వేతనాల కోసం, నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తపిస్తున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకనే స్థానిక ఎన్నికలను నిర్వహించాలన్నారు. రాష్ట్ర మహాసభల్లో ప్రజా సమస్యలను చర్చించి పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తారన్నారు. మహాసభలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్, కాకంకాశన్న, కుర్వ హన్మంతు, చిన్నకుర్మయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

# పాఠశాలలకు రక్షణేది?

- ప్రహరీలు లేక అల్లరిమూకల ఆగడాలు
- మద్యం తాగి ఆకతాయి చేష్టలు

రాజోళి: ప్రభుత్వ పాఠశాల భవనాలకు రక్షణ లేకుండా పోయింది. పలు పాఠశాలలకు ప్రహరీలు లేక ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. మరికొన్ని పాఠశాలలకు ప్రహరీలు ఉన్నా అవి కాస్తా శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆకతాయిల దుశ్చర్య..**


మండలంలో 23 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. రాజోళి, పెద్దతాండ్రపాడు, మాన్‌దొడ్డి, రాజోళిలోని ఉర్దూ పాఠశాలతో కలిపి నాలుగు జెడ్పీహెచ్ఎస్‌లు, కస్తూర్బా గాంధీ పాఠశాల ఒకటి, 15 ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పెద్ద తాండ్రపాడు పాఠశాలకు ప్రహరీ ఉండగా.. రాజోళి జెడ్పీహెచ్ఎస్ ప్రహరీ నిర్మించి ఏళ్ల గడుస్తుంది. ఇది కూడా మొత్తం కూలిపోవడంతో కూలిన గోడల నుంచి ఆకతాయిలు వచ్చి మద్యం తాగుతూ, ఫర్నీచర్ ధ్వంసం చేసి వెళ్తున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. మాన్‌దొడ్డి పాఠశాలలో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మరికొన్ని పాఠశాలలు ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉండటం, ప్రహరీలు కూడా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మార్పు రాలేదు....**


గతంలో కొన్ని పాఠశాలల దగ్గర ప్రమాదాలు జరిగినా అధికారుల తీరు మారకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. చిన్న పిల్లలు చదివే పాఠశాలల దగ్గర కౌంపౌండ్ వాల్స్ లేకపోగా.. కనీస రక్షణ చర్యలు కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముండ్లదిన్నె, నసనూరు తదిదర గ్రామాలతో పాటు చాలా పాఠశాలలు ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్నాయని, ప్రమాదాలు జరిగినా కూడా ప్రహరీల నిర్మాణంపై కదలిక లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. శిథిల ప్రహరీలకు కూడా కనీస మరమ్మతులు చేయడం లేదంటూ పేర్కొంటున్నారు.



రాజోళి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంచరిస్తున్న పందులు(ఫైల్)




రోడ్డు పక్కనే ప్రమాదభరితంగా ప్రహరీ లేకుండా ఉన్న నసనూరు పాఠశాల



రాజోళి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మందు సీసాలు


### ఆకతాయిల బెడద



మండల కేంద్రం రాజోళిలో నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై ఉన్న జెడ్పీహెచ్ పాఠశాల వద్ద ఆకతాయిల బెడద ఎక్కువైంది. రాత్రి అయ్యిందంటే ఆవరణలోకి వచ్చి మద్యం తాగడం, ఫర్నీచర్ ధ్వంసం చేయడం, పరిసరాలను నాశనం చేస్తున్నారు.

– నిషాక్, రాజోళి

### చర్యలు తప్పవు



పాఠశాలల్లో ఆకతాయిలు అల్లరి చేస్తున్నారని, పాఠశాల ఆవరణంలో మద్యం తాగుతున్నారని మా దృష్టికి వచ్చింది. గత వారంలో రాజోళిలోని పాఠశాలలో ఆకతాయిల గురుంచి సమాచారం రావడంతో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు,పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం.

– గోకారి, ఎస్ఐ రాజోళి

### ఇబ్బందులు ఉన్నాయి

మండలంలో పాఠశాలల్లో ప్రహరీలు లేక ఇబ్బందులు ఉన్నాయి. రాజోళి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల గోడ కూలిపోవడంతో పాటు, గోడ ఎత్తు కూడా తక్కువగా ఉండటం గేటు లేకపోవడంతో ఆకతాయిల బెడద ఎక్కువైంది. దీనిపై పోలీసుల దృష్టికి తీసుకెళ్లాం.

– భగీరథ రెడ్డి, ఎంఈఓ, రాజోళి